**ఈ వారం కథ**

**- యం. ఐ. కిషన్**

# భర్తలకు మాత్రమే

'మన పెళ్ళై మూడేళ్ళయింది. ఎప్పుడు చూసినా రేపు చేస్తా రేపు చేస్తా అంటారే తప్ప ఒక్కసారైనా చేసిన పాపాన్న పోయారా?' కోపంగా అంది కోమలి.

'ఛఛ! కట్టుకున్న భార్యని రేప్ చెయ్యడం బాగుండదు...' ఆమె కోపాన్ని ఖాతరు చెయ్యకుండా జోక్ చేశాడు భానుమూర్తి.

అలా అంటున్నప్పుడతను కనీసం వీక్లీలోంచి తల పైకైనా ఎత్తకపోవటంతో ఆ నిర్లక్ష్యానికి ఒళ్ళు మండిపోయింది [illegible]లికి.

'కుళ్ళు జోకులకేం కొదువలేదు' అంటూ అతని చేతుల్లోంచి వీక్లీని లాగవతల పారేసి, 'ఇవ్వాళ మీరు చేసి తీరాల్సిందే' అందామె మొండిగా.

'తప్పదా?' భానుమూర్తి భయం భయంగా అడిగాడు.

'తప్పదుగాక తప్పదు...' కచ్చితంగా చెప్పిందామె.

'సరే చేస్తాలే! కానీ ఆ తర్వాత నువ్వే బాధపడతావ్' హెచ్చరింపుగా అన్నాడు భానుమూర్తి.

'ఏం పడ్డు...' హామీ ఇస్తున్నట్టుగా అందామె.

'అయినా నీకిదేం పాడుకోరిక?' కాస్త విసుగ్గా అన్నాడు భానుమూర్తి.

'ఏదో నా ఆనందం నాది. ఎప్పుడూ నేనే చేస్తుంటాగా! ఒక్కనాడైనా మీ చేతి వంట తినాలని నాకనిపిం[illegible] ఏమిటి? అయినా నేను కాబట్టి ఇలా బతిమాల్తున్నా[illegible]గానీ కొంతమందైతే నిత్యం మొగళ్ళ చేతనే వండించుకు తింటుంటారు తెలుసా? ఎవరి దాకో ఎందుకు? మన ఎదురింటి మీనాక్షి, పక్కింటి సౌజన్య...'

లిస్ట్ చదవబోయిన భార్యకి మధ్యలోనే అడ్డు తగిలాడు భానుమూర్తి. 'వాళ్ళందరికీ వంట చేయడం వచ్చు కాబట్టి భార్యలకి చేసి పెడుతుంటారు. కానీ చిన్నప్పట్నుంచీ ఏనాడూ నేను వంట చేసిన పాపాన్న పోలేదే?' అన్నాడు 'అయామ్ హెల్ప్‌లెస్' అన్నట్టుగా చూస్తూ.

'వంట చేయడం ఏమన్నా బ్రహ్మావిద్యా? ఒకసారి చేస్తే అదే వచ్చుద్ది. నేనింత ముచ్చట పడుతున్నందుకైనా నా కోరిక తీర్చచ్చుగా?' నిష్ఠూరంగా అంది కోమలి. 'భార్య ముచ్చట తీర్చటం భర్తగా మీ కర్తవ్యంగాదా?'

'రోజూ నీతో ఈ పోరు పడలేక పోతున్నాను. సరే - ఇవ్వాళ నీ ముచ్చట తీర్చేస్తాలే గానీ, తీరా వొండేక వొండినవి తినబుల్‌గా ఉండకపోతే మాత్రం నన్నొక్కమాట కూడా అనకూడదు' ముందే కండిషన్ విధిస్తూ అన్నాడు భానుమూర్తి.

'తినబుల్‌గా ఎందుకుండవు? పక్కనుండి నేను డైరెక్షన్స్ ఇస్తుంటాగా?' భర్త ఒప్పుకున్నందుకు తెగ సంతోష పడిపోతూ అతన్ని కిచెన్‌లోకి లాక్కెళ్ళింది కోమలి.

★ ★ ★

'బియ్యం ఎన్ని కేజీలు పొయ్యాలి?'

భర్త ప్రశ్నకి నవ్వొచ్చింది కోమలికి. 'ఇద్దరు మనుషులకి కేజీలు కేజీలు వొండుకుంటారా? ఆ మూతి వెడల్పు స్టీలుగ్లాసుతో రెండు గ్లాసులు పొయ్యండి చాలు' అంది నవ్వుతూనే.

'నీళ్ళెన్ని పోయాలి? రెండు గ్లాసులకి ఇరవై సరిపోతాయా?' అమాయకంగా అడిగాడు భానుమూర్తి.

అతని ప్రశ్నకి మళ్ళీ నవ్వొచ్చేసింది కోమలికి.

నిజంగానే ఏనాడూ వంట చేసిన పాపాన్న పోలేదన్న మాట! అనుకుంది జాలిగా.

'ఎవరైనా వింటే నవ్విపోతారు. నాలుగ్లాసులు పొయ్యండి చాలు. ఉడికాక దించేసుకోవచ్చు. అంటే అత్తెసరన్నమాట?' చెప్పింది నవ్వాపుకుంటూ.

'అత్తెసరంటే?' అడిగాడు భానుమూర్తి.

'వార్పు కానిది...' చెప్పింది కోమలి.

'వార్పంటే?'

'అత్తెసరు కానిది...' ఫకాల్న నవ్వి, ఆ మీదట 'వార్పూ-అత్తెసరు' లకు మధ్యగల తేడాని అతనికి వివరించి చెప్పింది.

'వార్పే! అయితే అన్నం వండటంలో రెండు రకాలున్నాయన్నమాట?' అన్నాడు భానుమూర్తి ఆశ్చర్యంగా.



'వంట చేయడం ఏమన్నా బ్రహ్మ విద్యా? ఒకసారి చేస్తే అదే వచ్చుద్ది. నేనింత ముచ్చట పడుతున్నందుకైనా నా కోరిక తీర్చచ్చుగా?' నిష్ఠూరంగా అంది కోమలి.

ఓ అరగంట తర్వాత-

ఎలాగోలా అన్నం వండటం ముగించి 'వాటిజ్‌పుట్ కూర?' అనడిగాడు భానుమూర్తి.

'మీకేకూర బాగా వచ్చు?'

'ఏదీ రాదు. ఏదైనా సరే నువ్ చెప్తుంటే చెయ్యాల్సిందే...' తెలకళ్ళు వేస్తూ చెప్పాడు భానుమూర్తి.

'సరే. బంగాళాదుంపల వేపుడు చేసి పప్పు చారు కాద్దురుగాని.. ముందు పదార్థాలన్నీ రెడీ చేస్కోండి...' అని... వాటిగ్గాను ఏయే పదార్థాలు ఎంతెంత లేసి పెట్టి కోవాలో చెప్పింది కోమలి.

బంగాళాదుంపలు చెక్కు ఇలా తియ్యాలి... పప్పులో రాళ్ళు లేకుండా ఇలా బాగుచేస్కోవాలి... పచ్చిమిరపకాయలు ఇలా తరుక్కోవాలి... ఉల్లిపాయలు ఇలా వల్చుకోవాలి... ఇలా కోమలి ఒక్కటొక్కటే శాంపిల్‌గా చేసి చూపిస్తుంటే ఆ పద్ధతిని ఫాలో అవుతూ, నానా తంటాలూ పడి మొత్తానికెలాగో ఓలా ఆ పూటకి వంటయ్యిందనిపించాడు భానుమూర్తి.

ఆమె పక్కనుండి చెప్తున్నా కూడా ఒకదాని కొకటి విని... ఉప్పుకారం ఇత్యాదులు ఎడాపెడా వేసేశాడు భానుమూర్తి.

ఫలితంగా... రుచి చూసినంతనే డోకొచ్చేంత ఛండాలంగా తయారయింది వంటంతా.

'పప్పు చారా - కాదిది ఉప్పు కషాయం! బంగాళా దుంపల ఫ్రైనా ఇది - కాదు గొడ్డుకారం ఇగురు...' టేస్ట్ చూసి... ముఖాన్ని చీదరగా పెట్టి కోమలి అలా అంటుంటే–

'నేను ముందే చెప్పలా. 'చేసింతర్వాత నువ్వే బాధ పడతావ్' అని ' అన్నాడు భానుమూర్తి.

'అన్నాన్లేగానీ మరీ ఇంత ఛండాలంగా చేస్తారనుకో లేదు' అంది కోమలి.

'మరీ అంత దరిద్రంగా ఉందా?'

'కాస్త తిని చూడండి మీకే తెలుస్తుంది...'

భార్య మూతి తిప్పుతూ అలా అనేసరికి 'ఎందుకు తినలేను భేషుగ్గా తింటాను' అంటూ పౌరుషానికి పోయి కూరతో ఓ రెండు ముద్దలూ, చారుతో ఓ రెండు ముద్దలూ లాగించేశాడు భానుమూర్తి.

విషం తన ప్రభావాన్ని చూపడానికి టన్నుల కొద్దీ తినాల్నా ఏంటి?

ఆ నాలుగు ముద్దలకే భళ్ళు భళ్ళున డోక్కుంటూ కళ్ళు తిరిగి పడిపోయాడు భానుమూర్తి.

తిరిగి కళ్ళు తెరిచేసరికి కోమలి తడిగుడ్డతో తన మొహం తుడుస్తూ కనిపించిందతనికి.

ఆమె కళ్ళ నిండా తడి!

'అరె అదేంటి కోమలీ? ఏడుస్తున్నావా?' అన్నాడు భానుమూర్తి.

'పాపిష్ఠిదాన్ని! వంట చెయ్యడం రాని మీతో నానాతిప్పలూ పెట్టి మరీ వంట చెయ్యించాను! పైగా మాటల్తో రెచ్చగొట్టి మీతో ఆ విషతుల్య పదార్థాలు తినిపించాను. ఇంకెప్పుడూ ఇలా చెయ్యను. నన్ను మన్నించరూ...' పమిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ అంది కోమలి.

'అదేంటి కోమలీ? ఇందులో నీ తప్పేముందనీ? వంట ఒళ్ళు దగ్గర పెట్టుకోకుండా చెయ్యడం నాదీ తప్పు! ఈసారెలాగైనా సరే మాంచి రుచిగా కుదిరేలా చేస్తాలే' అన్నాడు భానుమూర్తి ఆమె చెంపల్ని నిమురుతూ.

'అంటే మళ్ళీ చేస్తారా వంట? వద్దులెండి. చచ్చినా సరే మళ్ళీ ఇంకెప్పుడూ మీతో ఆ పాడు పని చెయ్యం చను...' లెంపలేసుకుంటూ అంది కోమలి.

'అదేం మాట కోమలీ! నలుగురైదుగుర్ని చంపందే డాక్టర్ కాలేరెవ్వరూ! ఇవ్వాళిలాగైందని ఎప్పటికీ ఇలాగే వండుతానా ఏంటి? మరో నాలుగైదుసార్లు ప్రయత్నిస్తే అదే కుదురుద్ది బాగా చెయ్యటం...' ఆమె వంక ప్రేమగా చూస్తూ అన్నాడు భానుమూర్తి.

'ఏంటి కుదిరేది నా బొంద? మళ్ళీ మీ వంట అన్న మాట వింటుంటేనే వొణుకు పుడుతోంది నాకు' నిజంగానే వణుకుతూ అంది కోమలి.

వణుకుతున్న కోమలిని చూస్తుంటే భానుమూర్తి మనసులో వరుణ్ మెదిలాడు.

చదువుకునే రోజుల్లో వరుణ్, భానుమూర్తి రూమ్మేటు. ఇద్దరూ కలిసి కంబైన్డ్‌గా వండుకు తింటుం డేవాళ్ళు.

అన్నం వండటం, అంట్లు కడగటం వరుణ్ డ్యూటీ.

కూరలు మాత్రం ఎప్పుడూ భానుమూర్తే వండే వాడు.

ఆ కూరల్ని 'నీ ముందు నలుడు, భీముడూ కూడా పనికిరారు. ఎక్కడ నేర్చుకున్నావ్‌రా ఇంత బాగా వండటం?' అని లొట్టలేస్తూ మరీ ఆరగించేవాడు వరుణ్.

వరుణ్ అనే ఏముంది? భానుమూర్తి వంటచేస్తే ఎవరైనా సరే లొట్టలేస్తూ తినాల్సిందే!

అతని ఫ్రెండ్సంతా కూడా అదే మాట అంటుండే వారు!


అది గుర్తొచ్చి చిన్నగా నవ్వుకున్నాడు భానుమూర్తి.

అది చూసి 'ఎందుకండీ నవ్వుతున్నారు?' అనడిగింది కోమలి.

అసలు విషయం చెబితే ఇంకేవన్నా ఉందా?

'అబ్బే ఏం లేదు. ఇందాకటి కూరలు గుర్తొచ్చి...' అంటూ మళ్ళీ నవ్వేశాడు భానుమూర్తి. బ్రతకనేర్చిన వాడు మరి!

★




(6వ పేజీ తరువాయి)

ఇంగ్లీషు వాడు (ఉత్తర) అమెరికాలో కాలుపెట్టాడో లేదో అలా 'రెడ్ ఇండియన్స్' జాతినే లేకుండా సర్వనాశనం చేసి పారేశాడు కదా...?!' అని అని వుండేదేమో...

తరువాత ఆ 'అమెరికా బెంగాలీ తెలుగమ్మాయి' వెళ్ళిస్తాననైనా చెప్పకుండా... ఒక ప్రముఖ తెలుగు దినపత్రికకి ఈ విషయమంతా ఏడుస్తూ చెప్పుకుంటే... ఆ సంపాదకుడు 'దాన్నంత' పతాక శీర్షికతో 1983 సంవత్సరంలో సంచలనాత్మకంగా ప్రచురించాడు...!

కానీ అది సంచలనాత్మక వార్తేమీ కాలేదు...!! ఎంతయినా తెలుగు వాళ్ళు కదా 'తాపీగా' చదువుకుని, 'సానుభూతిగా' పెదవి విరిచారు అంతే...!!

ఇదీ తెలుగువాళ్ళు తమ తెలుగుభాషకి ఇస్తున్న గౌరవం... మర్యాదలు...!! అదే తమిళుల్ని చూడండి... తమ జాతికి శ్రీలంకలో ఏదో ఘోరం జరిగిపోతుందని ప్రపంచవ్యాప్తంగా వున్న తమిళులు ఒక ఎల్‌టిటిఇని తయారుచేసేందుకు దోహదపడ్డారు...! అదే పరిస్థితిలో తెలుగు వాళ్ళుంటే... ఏ విధంగా రియాక్ట్ ... వాళ్ళు?!

అసలు మనకి 'తెలుగు భాష' అన్నా... 'తెలుగు సంస్కృతి' అన్నా... గౌరవం లేకపోవడానికి కారణం ఏమిటి?

'తెలుగుదేశం' పార్టీ ఆవిర్భవించిన కొత్తల్లో... ప్రపంచ దేశాల్లో వున్న తెలుగువాళ్ళు మాకింత విద్యాభిక్ష పెట్టండి అని బతిమాలుకుంటే మొదట్లో ఏదో 'అంతర్జాతీయ కేంద్రం' స్థాపించి కొంత సహాయం చేశారు. ఇప్పుడు వాళ్ళకు అందుతున్న మొక్కుబడి సహాయమే!

పరదేశాల్లో ఇద్దరు తెలుగువాళ్ళు ఎదురుపడితే... ముఖాలని తిప్పుకుని పోతారట...!! ఎవరికివారే తాము చాలా గొప్పవాళ్ళమనే ఒక సుపీరియారిటీ కాంప్లెక్సుట...!!

'ఈ విధంగా ఎదురుపడ్డ వాళ్ళని చూసే మొహాలు తిప్పుకుంటే... ఇక కనిపించని ఆ భాషను గురించి... ఆ తెలుగు సంస్కృతి గురించి... ఇహనేం పట్టించుకుంటారు...?!'

అయితే... ఇప్పుడీ పరిస్థితి కొద్దిగా మారిందట! ఇందుకు కారణం బహుశా తెలుగు అభిమానంగల ఆంధ్ర యువకులు అమెరికాని చేరడమే అనుకుంటా.. ...డొక ముఖ్యమైన విషయం ప్రస్తావించకుండా వుండలేను.

నా బంధువర్గంలోనే - మా బావమరిది, మా చిన్నమ్మాయి ఆంధ్రేతరుల్ని వివాహం చేసుకున్నారు. వాళ్ళల్లో ఆ మాతృభాషాభిమానం తమిళ సాంప్రదాయాన్ని పరదేశంలో వున్నా ఎలా నిలుపుకోగలిగారని అడిగాను... దానికి వాళ్ళు చెప్పిన సమాధానం ఈ విధంగా ఉంది.

పిల్లలకు ఐదో ఏట వరకు ఇంట్లో తమిళం నేర్పిస్తారట! తమిళ సంస్కృతి గురించి బాగా చెప్తారట! తమిళ సంగీతం కర్ణాటక సాంప్రదాయంలో నేర్పిస్తారట!

అలా 'పునాది బలం' పడితే... వారి సాంప్రదాయాన్ని ఎలా మరిచిపోతారు..? 'మొక్కై వంగనిది... మానై వంగుతుందా...' అన్న సామెత దీనికి సరిగ్గా వర్తిస్తుంది!!

ఇప్పుడు అమెరికా వెళ్తున్న ఆంధ్ర యువకులకి ఆ పునాది బలం ఒక హైదరాబాద్ నుంచి వెళ్ళే వాళ్ళకి తప్పిస్తే... మిగతా వాళ్ళకి వుంటుంది...!!

★